క్లుప్తంగా

సోమేశ్వరాలయంలో పూజలు

పాలకుర్తి టౌన్: స్వయంభూ సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశిని పురస్కరించుకుని శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈఓ బి.లక్ష్మిప్రసన్న, అర్చకులు సిబ్బంది ఉన్నారు.

ఇషా ఫౌండేషన్ క్రీడా పోటీలు

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ ఉన్నత పాఠశాలలో ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఇషా గ్రామోత్సవ్ అనే నినాదంతో తొలిసారిగా నిర్వహించిన క్రీడా పోటీలను సర్పంచ్ లక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ మేడ స్వామి ప్రారంభించారు.

పరామర్శ



కొడకండ్ల: హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్ కుమారుడు రాహూల్‌గాంధీనాయక్‌ను శనివారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. రాహూల్ ఆరోగ్య పరిస్థితిని మంత్రి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. గాంధీనాయక్, కవిత, రాము, జయంధర్‌పవార్ ఉన్నారు.

పాకాలలో..

మండలంలోని పాకాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బాకి ప్రేమ్‌కుమార్ కుటుంబసభ్యులను శనివారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. ప్రేమ్‌కుమార్ తండ్రి వెంకయ్య గత కొద్ది రోజుల క్రితం మృతి చెందగా వెంకయ్య చిత్ర పటానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు.

గీత కార్మికుని కుటుంబానికి..

కొడకండ్ల: తాటి చెట్టుపైనుంచి పడి మృతి చెందిన రామవరం గ్రామానికి చెందిన గీత కార్మికుడు చెరుకు సైదులు కుటుంబాన్ని శనివారం మండల కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. సైదులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్యేను కలిసిన ముదిరాజ్ నాయకులు



జనగామ: జిల్లా మురాజ్ నాయకులతో పాటు ఫిషరీస్ యజమానులు శనివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కట్ల సదానందం, జిల్లా కార్యదర్శి ఇట్టబోయిన రమేష్, వంగాల గోవర్ధన్, తేజావత్ గోవర్ధన్, శనిగరం మల్లేశం, శంకర్, సానబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన బీఆర్ఎస్ నాయకుడు

రఘునాథపల్లి: దివంగత మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు కూతురు ఎమ్మెల్సీ సురభి వాణిదేవిని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వారాల రమేష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర టూరిజం చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌తో కలిసి హైదరాబాద్‌లో సురభివాణిదేవి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆర్థిక సాయం



జనగామ: పట్టణానికి చెందిన వలబోజు పవన్ కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా సహచర మిత్రులు, 1997–98 పదో తరగతి పూర్వ విద్యార్థులు శనివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుమార్తె వైష్ణవి పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన రూ.1.50లక్షల బాండ్ పేపర్‌ను అందించారు. సంతోష్, గణేష్, ప్రభాకర్, శశికుమార్, నాగరాజు, పరమేశ్వర్, రవి, సురేష్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటం

దేవరుప్పుల: ఉపాధ్యాయ, ఉద్యోగుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటం అనివార్యమని యూఎస్‌పీసీ సంఘ ప్రతినిధులు కందుల శ్రీనివాస్, జోగు వరప్రసాద్, ముడిదె రాము పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం మండలంలోని కామారెడ్డి గూడెం హైస్కూల్‌లో ఈ నెల 23న హైదరాబాద్‌లో యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్ర స్థాయి ఐక్య సదస్సు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. హైస్కూల్ హెచ్ఎం ఇంజమూరి శ్రీలత, లక్ష్మణ్, వెంకన్న పాల్గొన్నారు.

ఇది.. రోడ్డే



ఈ చిత్రంలో కనిపిస్తున్నది పాలకుర్తి మండలం గూడూరు శివారు తండాకు చెందిన రోడ్డు. ఐదు గ్రామాల ప్రజలకు ఉపయోగపడే ఈ రహదారి నిర్మాణాన్ని మట్టిపోసి అసంపూర్తిగా వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారడంతో కాలి నడక కూడా సాగని పరిస్థితి నెలకొంది. దారివెంట వెళ్లాలంటే ప్రజలు నరకం చూస్తున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

జనగామ రూరల్: గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన ధర్నా కరపత్రాలను జిల్లా కేంద్రంలోని ఎంజేపీ గురుకుల పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. గురుకుల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, అన్ని సొసైటీల్లో ఒకే విధమైన పాలన అమలు చేయాన్నారు. బోధనతో పాటు హౌస్‌మాస్టర్, కేర్‌టేకర్, వార్డెన్, నైట్‌స్టే, ఎస్కాట్ వంటి పనులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శ్రమకు తగిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాస్, సుధార్‌రెడ్డి, కృష్ణ, దేవయ్య, చంద్రమౌళి, సరిత, రాజు, లలిత తదితరులు పాల్గొన్నారు.

100 శాతం డ్రైవింగ్ లైసెన్స్‌లతో జనగామకు కీర్తి



స్లాట్ బుకింగ్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

జనగామ: జనగామ నియోజకవర్గం వందశాతం డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగిన రికార్డును సొంత చేసుకోబోతుందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే సొంత ఖర్చులతో గత కొంత కాలంగా ఇస్తున్న డ్రైవింగ్ లైసెన్స్‌ల్లో భాగంగా శనివారం జనగామ అర్బన్, మండలంలోని యువతకు స్లాట్ బుకింగ్ పత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 7,500 దరఖాస్తులు రాగా, చివరి వరకు 18వేలు వచ్చే అవకాశం ఉందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం గ్రామ గ్రామాన నిర్వహిస్తున్న శిబిరాల్లో అనూహ్య స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మేధావులు, ప్రజలు ప్రశంసిస్తున్నారు. పాలకుర్తి నియోజక వర్గంలో కూడా నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది.

మాదిగలు ఐక్యంగా ఉండాలి

జనగామ రూరల్: ఎస్సీ వర్గీకరణ పోరాటం అంతిమ దశకు చేరుకుంది.. పార్లమెంట్‌లో చట్టబద్ధత పొందేందుకు మాదిగలు ఐక్యంగా ఉండాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్‌లు బి.విజయ్, ఎం.శ్యామ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌తో ఆగస్టు 2వ వారం హైదరాబాద్‌లో తలపెట్టిన మాదిగల విశ్వరూపం మహాసభ నేపథ్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాని మోదీ వరంగల్ పర్యటనకు వచ్చిన సందర్భంగా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మంద కృష్ణ మాదిగ కోరగా ఆయన ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పైసా రాజశేఖర్, బొట్ల మహేష్, టి.కుమార్, శ్యాసన్, జి.కిషోర్, డి.రవి, సుధాకర్, నర్సింగరావు, భాస్కర్, కుమారస్వామి పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌లో నిత్య ఉచిత అల్పాహారం



వంటగదిని ప్రారంభిస్తున్న సంజీవరెడ్డి

జనగామ: జనగామ చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రంలో లయన్ ఎస్.వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ గౌరవ సభ్యుడు జైన రమేష్ అత్తమ్మ మన్నెం శైలజాకృష్ణమూర్తి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిత్య ఉచిత అల్పాహారం అందజేశారు. పలు క్లబ్‌ల సభ్యులు రాజశేఖర్ రెడ్డి, రవి నాయక్, తీగల సిద్ది మల్లయ్య, బిజ్జాల నవీన్, శివరాం, సంజయ్, గట్టు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వంటగది నిర్మాణం ప్రారంభం..

యశ్వంతపూర్ ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ ఆధ్వర్యంలో నిర్మించిన వంటగదిని ప్రారంభించారు. దాత, పూర్వ రీజియన్ చైర్మన్ యడమ సంజీవరెడ్డి గదిని ప్రారంభించగా, స్కూల్ ఉపాధ్యాయులు, లయన్ ప్రతినిధులు ఆయన సేవా నిరతిని కొనియాడారు. రాపాక విజయ్, రాజశేఖర్ రెడ్డి, జైన రమేష్, తీరుపల్లి కృష్ణారెడ్డి, మాచర్ల బిక్షపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, గ్రామ సర్పంచ్, ఎస్ఎంసీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



బచ్చన్నపేట: మండలంలోని కేసిరెడ్డిపల్లికి చెందిన బాల్నె రమేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా బీఆర్ఎస్ నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన రమేష్‌కు ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం వైద్యఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావుతో మాట్లాడి ఎల్‌ఓసీని ఇప్పించామన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

లింగాలఘణపురం: కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిట్ల ఉపేందర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలోని 123 మంది విద్యార్థులకు ఉచితంగా స్పోర్ట్స్ దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం పద్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి ఉన్నతులుగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీ, నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం, ఎస్ఎంసీ చైర్మన్ స్వామి, నాయకులు యాదగిరి, రవి, రాజు, వీరయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బంధు రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన ఉపేందర్‌రెడ్డి



పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బొకే ఇస్తున్న ఉపేందర్‌రెడ్డి

కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిట్ల ఉపేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం రైతుబంధు రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయనతో పాటు ఎంపీపీ జయశ్రీ, కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాజు ఉన్నారు.

నోట్‌బుక్స్ అందజేత



నోట్ బుక్స్ అందజేస్తున్న రమేష్

దేవరుప్పుల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న అంధత్వ బాలిక రిత్వికకు నిత్యం అన్ని విధాలుగా సహకరిస్తున్న సహచరుల సాయానికి సార్థకతగా ఆ బాలిక తండ్రి కావటి రమేష్ రూ. 5,100 వెచ్చించి నోటుబుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కంటిచూపు లేని తన కూతురుకు ఓనమాలు నేర్పేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు సంపూర్ణ సహకారాల పట్ల కన్నీటి పర్యంతో కృతజ్ఞతలు తెలిపారు. హెచ్ఎం అంబటి అంజయ్య, బీఆర్ఎస్ మండల నాయకుడు తోటకూరి కిష్టయ్య, ఉపాధ్యాయురాలు ఉమారాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బచ్చన్నపేట: ప్రస్తుతం వర్షాకాలంలో అందరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండలంలోని కట్కూర్ సర్పంచ్ మూసిని సునీత అన్నారు. శనివారం గ్రామంలో వైద్యాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వర్షాకాల సీజన్‌లో పలు రకాల జబ్బులు వస్తాయని గ్రామంలో ఆశలు ఇంటింటికి తిరిగి జబ్బులబారిన పడిన వారిని గుర్తించి అవసరమైన మందులను అందించాలన్నారు. జబ్బు నయం కాని పక్షంలో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని సూచించాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ప్రశాంత్ ఆచార్య, నాయకులు మూసిని రాజు, ఎల్లయ్య, ఏఎన్ఎంలు సుభాషిణి, ప్రణీత, ఆశలు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న ఆదర్శ పాఠశాల



భోజనం తింటున్న ఎస్ఎంసీ చైర్మన్ బాపురెడ్డి

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ఆవరణ మురుగునీటితో కంపు కొడుతోందని పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ గొల్లపల్లి బాపురెడ్డి అన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయనే ఆరోపణలతో శనివారం మధ్యాహ్న భోజనాన్ని తిన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేరుకే ఆదర్శ పాఠశాల అని, మౌలిక వసతులు సరిగాలేవని తెలిపారు. గ్రామ పంచాయతీ మురుగు కాల్వల నీరు గత మూడు సంవత్సరాలుగా పాఠశాల ఆవరణలోకి వస్తున్నా పట్టించుకున్న నాథుడే లేరన్నారు. ఆ మురుగు నీటిలో పందులు, కుక్కలు దొర్లి మధ్యాహ్న భోజనం తినే విద్యార్థుల వద్దకు వస్తున్నాయని చెప్పారు. విద్యార్థులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నా ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అధికారులు చొరవ తీసుకొని పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. మురుగు నీరు వెళ్లేందుకు అండర్ డ్రెయినేజీని నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో దేశ పురోగతి

జనగామ రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం పురోగతి సాధించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం కేంద్ర పథకాలను పట్టణంలో ఇంటింటా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పేద ప్రజలకు కేంద్రం ఉచితంగా బియ్యం అందిస్తున్నదని చెప్పారు. ఈ సందర్భంగా ఏబీవీ డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ కాసం అంజయ్యకు మోదీ పాలన బుక్‌లెట్ అందజేశారు. రమేష్, శివరాజ్, కార్తిక్, సంపత్, జగదీష్, క్రాంతి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

జనగామ రూరల్: పాట్నాలో నవంబర్ 2 నుంచి జరిగే వ్యవసాయ కార్మిక సంఘం(బీకేఎంయూ) జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలమల్లేష్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో వ్యవసాయ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి సమగ్ర చట్టం తేవాలనే డిమాండ్‌తో దేశ వ్యాప్తంగా ఉద్యమం కొనసాగుతుందని చెప్పారు. జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి, సాయన్న, ఎ.శ్రీనివాస్, మైసయ్య, ఎల్లయ్య, సత్యం, యాదగిరి, నాగరాజు పాల్గొన్నారు.

కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



చిల్పూరు: మాట్లాడుతున్న రాపర్తి రాజు

సాక్షి నెట్‌వర్క్: న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని జిల్లా వ్యాప్తంగా జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా శనివారం మోకాళ్లపై నిల్చొని వినూత్న నిరసన తెలిపారు. రఘునాథపల్లిలో జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు బొల్లం అజయ్, జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పోకల శివకుమార్‌లకు వినతి పత్రాలు అందజేసి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని విజ్ఞప్తి చేశారు. చిల్పూర్‌లో చేపట్టిన సమ్మెలో జేఏసీ చైర్మన్ రాపర్తి రాజు పాల్గొని మాట్లాడారు.

జనాభా నియంత్రణకు పాటుపడాలి



ప్రోత్సాహకాలు అందజేస్తున్న క్లబ్ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రపంచంలో భారతదేశం జనాభాలో ప్రథమ స్థానంలో ఉందని, జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఘన్‌పూర్ లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ ఆమంచ మధుసూదన్ అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న వారికి క్లబ్ ఆధ్వర్యంలో ప్లేట్లు, గ్లాసులు, బ్రెడ్‌లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కరు లేదా ఇద్దరు పిల్లలు చాలు అనే సూత్రాన్ని అందరూ పాటించాలన్నారు. క్లబ్ అధ్యక్షురాలు యువాన్‌జాన్, కార్యదర్శి నిర్మల, కోశాధికారి మంజుల, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

స్టేషన్‌ఘన్‌పూర్ లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఈనెల 16న నిర్వహించనున్నట్లు మధుసూదన్ తెలిపారు. స్థానిక పద్మావతి గార్డెన్స్‌లో రాత్రి 7 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి లయన్స్‌క్లబ్ బాధ్యులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

జఫర్‌గఢ్: విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బేబి హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో చదువు ద్వారానే అన్ని సాధించవచ్చన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకొని లక్షసాధన కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ కుంభోజి మహాదేవ్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా వారకల్యాణం

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి వారకల్యాణం శనివారం భక్తజనసందోహం నడుమ అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ బాగం లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావుల సమక్షంలో హైదరాబాదుకు చెందిన బాలమురళి వెంకటసుబ్రమణ్యం–శ్రీలక్ష్మీవల్లిలు అన్నదానం చేశారు.

కేసు నమోదు

పాలకుర్తి: పాలకుర్తికి చెందిన మార్గం రమ దర్దేపల్లి శివారులో కొనుగోలు చేసిన భూమిని ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ శ్రీనివాస్‌రావు తెలిపారు. శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. మూడేళ్ల క్రితం రమ కొనుగోలు చేసిన భూమి వద్ద కంచె నాటుతుండగా దర్దేపల్లికి చెందిన డంబాల నర్సయ్య వచ్చి అడ్డుకొని దూషించి చంపుతానని బెదిరించాడు. రమ ఫిర్యాదు మేరకు ఫిర్యాదు మేరకు డంబాల నరసయ్యతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశామన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తికి గాయాలు

జనగామ రూరల్: రోడ్డుపై గుంతలను తప్పించబోయి ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తికి గాయాలైన ఘటన శనివారం గానుగుపహడ్–మరిగడి వెళ్లే రోడ్డుపై చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. మరిగడికి చెందిన పొన్నగంటి భాస్కర్ జనగామ నుంచి గ్రామానికి వస్తుండగా రోడ్డుపై గుంతలను తప్పించబోయి ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. డ్రైవర్ భాస్కర్ ట్రాక్టర్ మధ్యలో ఇరుక్కుపోయి గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దరఖాస్తుల స్వీకరణ

జనగామ రూరల్: జనగామలోని కొమ్మూరి క్యాంపు కార్యాలయంలో శనివారం 3వ రోజు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ల దరఖాస్తులు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి కృషితో డ్రైవింగ్ లైసెన్స్ అందిస్తున్నారని, యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా నాయకుడు సిల్లెల సిద్దారెడ్డి తెలిపారు. లైసెన్స్ కావల్సిన వారు పదో తరగతి మెమో, ఆధార్ జిరాక్స్‌తో పాటు ఫొటో తీసుకొని సిదిపేట రోడ్డులోని కొమ్మూరి క్యాంపుకార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

18వ రోజు కొనసాగిన స్వీపర్ల సమ్మె

జనగామ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు కనీస వేతన అమలు చేయాలని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద చేపడుతున్న సమ్మె శనివారం 18వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అంజయ్య దీక్షను ప్రారంభించి మాట్లాడారు. భాస్కర్, అమోద్య, మల్లేషం, లాలు, రాములు, యాదయ్య, పర్శరాములు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో సర్పంచ్ చొరవ

బచ్చన్నపేట: మండలంలోని ఆలింపూర్‌లో సర్పంచ్ నరెడ్ల బాల్‌రెడ్డి చెత్త సేకరణలో చొరవ చూపారు. జీపీ కార్మికులు సమ్మెలో ఉండటంతో గ్రామాన్ని శుభ్రంగా ఉంచేందుకు శనివారం సర్పంచ్ స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ వీధుల్లో తిరిగి చెత్తను సేకరించారు.

గ్రామానికి మంచి పేరు తెస్తా..



చిల్పూరు: మండలంలోని చిన్న పెండ్యాల గ్రామానికి చెందిన తాళ్ల పల్లి పావని యూకేలో ఎంఎస్ పూర్తి చేసి శనివారం పట్టా పొందింది. గ్రామానికి చెందిన తాళ్లపల్లి బాలమల్లు భిక్షపతి–విజయల కూతురు పావని మొదటి నుంచి చదువులో చురుకుగా ఉండేది. ఉన్నత విద్యే లక్ష్యంగా యూకేకు వెళ్లిన పావని పట్టా పొంది గ్రామానికి మంచి పేరు తెస్తానంది. గ్రామం నుంచి పట్టా పొందిన మొదటి విద్యార్థి పావనిని పలువురు అభినందించారు.

నియామకం

జనగామ రూరల్: ఏబీవీపీ పట్టణ ఉపాధ్యక్షులుగా విశ్వనాథుల ఉదయ్, పెండ్లి అరవింద్‌ను నియమించినట్లు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్ సాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఉచిత కరెంటుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతాంగానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డారు. చంద్రబాబునాయుడు ప్రియశిష్యుడిగా, అతడి ఏజెంట్‌గా, తొత్తుగా రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేయడమంటే ఆకాశంపై ఉమ్మి వేసినట్లే అన్నారు. రైతులకు ఉచిత కరెంటు వద్దని వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి రాజకీయ సమాధి తప్పదని ఆయన హెచ్చరించారు.

మూడు గంటల కాంగ్రెస్ కావాలా..
మూడు పంటల బీఆర్ఎస్ కావాలా...

మూడు గంటల విద్యుత్ అందించే కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి కావాలా, మూడు పంటలకు ఉచిత విద్యుత్ అందించే బీఆర్ఎస్, కేసీఆర్ కావాలా అనే అంశంపై ప్రజలు చర్చించాలని ఎమ్మెల్యే రాజయ్య కోరారు. ఈనెల 17 నుంచి 27 వరకు నియోజకవర్గంలోని గ్రామగ్రామాన రైతువేదికల వద్ద ఈ అంశంపై కార్యక్రమాలు ఉంటాయన్నారు. జెడ్పీటీసీ మారపాక రవి, ఎంపీపీ కందుల రేఖ, ఘన్‌పూర్ సర్పంచ్ సురేష్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ రాజు, ఎంపీటీసీలు నర్సింహులు, ఎస్.దయాకర్ పాల్గొన్నారు.

సీపీని కలిసిన రాజయ్య

హనుమకొండలోని వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీతో ఎమ్మెల్యే కాసేపు మాట్లాడారు.

బీఆర్ఎస్ పార్టీతో కార్యకర్తలకు మేలు

లింగాలఘణపురం: బీఆర్ఎస్ పార్టీలో కార్యకర్తలుగా ఉండి సభ్యత్వం తీసుకుంటే ప్రమాదవశాత్తు మృతిచెందిన వారికి పార్టీ రూ.2లక్షల బీమా అందజేస్తుందని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. శనివారం మండలంలోని చీటూరు మాజీ సర్పంచ్ యాదయ్య భార్య సోమక్క, నేలపోగులలో గొలనకొండ సోమక్క, జీడికల్‌లో కొండబోయిన బక్కయ్య మృతి చెందగా ఆ కుటుంబాలను ఎమ్మెల్యే రాజయ్య పరామర్శించారు. చీటూరులో సోమక్క పాడె మోశారు. అనంతరం మాణిక్యాపురంలో ఇటీవల మృతిచెందిన రాగం కిష్టయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా పార్టీ సభ్యత్వం కలిగి ఉండడంతో వచ్చిన రూ.2 లక్షల బీమా చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.

సర్కారు దృష్టికి తీసుకెళ్లాలి

కొడకండ్ల : తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ పంచాయతీ కార్మికులు ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ అందె యాకయ్యకు వినతిపత్రం సమర్పించారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం జీపీ కార్మికులు సమ్మె కొనసాగించారు. సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, యాకన్న, శ్రీనివాసచారి, బయ్యన్న, సుధీర్, ధర్మనాయక్, వెంకన్న, అయిలయ్య పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

పాలకుర్తి: మండలంలోని ఆటో యూనియన్ పాలకుర్తి–తిర్మలగిరి నూతన కమిటీ శనివారం ఎన్నికైంది. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా వెన్న యాకయ్య, అధ్యక్షుడుగా మచ్చ సోమన్న, ప్రధాన కార్యదర్శిగా వుదారి సుధాకర్, ఉపాధ్యక్షుడిగా నాగలబోయిన సింహాద్రి, కోశాధికారిగా మూడ కిషన్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సోమిరెడ్డి యాదవరెడ్డి, బొడిగె యాకన్న తదితరులు ఎన్నికయ్యారు.